# ఆడపిల్లయితే...

శారదమ్మకి నలుగురు కుమార్తెలు. వాళ్ళ పెళ్ళిళ్ళు అయ్యాక ఆమె భర్త చనిపోయాడు. భర్తలేని చింత తప్ప ఆమెకేలోటూ లేదు. పిల్లలు తలో ఊళ్ళోనూ హాయిగా సంసారాలు చేసుకుంటున్నారు. చిన్న కుమార్తె లలిత మాత్రం తొలి కాన్పుకని పుట్టింటికొచ్చింది. ఆమెకు డాక్టరిచ్చిన తేదీకి మూడు రోజుల ముందుగా నొప్పులొస్తుంటే ఆస్పత్రికి తీసికెళ్ళింది శారదమ్మ. డాక్టరు పరీక్ష చేసి కాసేపట్లో పురుడు వస్తుందని చెప్పింది. అక్కడున్న ఫోన్ ద్వారా ముగ్గురు కుమార్తెలకీ, చిన్నల్లుడికీ ఆ విషం తెలిపి, లలిత గది వద్ద కూర్చుందామె.



అరగంట గడిచిందో లేదో నర్సు నిర్మల, శారదమ్మ చెంతకొచ్చి "మామ్మగారూ, వరుసగా మీ అమ్మాయిలు ముగ్గురూ ఫోన్ చేశారు. నా గొంతు వింటూనే- మిమ్మల్ని పిలుస్తానంటే వద్దని, 'లలితమ్మకు ఆడా? మగా? 'అని అడిగారు. ఇంకా పురుడు రాలేదన్నాను.

"ఇంతకీ మగైతే ఏమిటి... ఆడైతే ఏమిటట? " అంది ముఖం చిట్లించుకొని.

శారదమ్మ నవ్వి "ఇంతవరకూ మా వాళ్ళకి మగవాళ్ళే గాని ఆడపిల్లలు పుట్టలేదన్న సంగతి నీకు తెలిసిందే కదా! ఎవరికి ఆడపిల్ల పుడితే వాళ్ళకి నా ఇరవై తులాల బంగారం వడ్డాణం ఇచ్చేస్తానని ఎప్పుడో మాటిచ్చాను. ఇప్పుడు లలితకు పుట్టేది ఆడపిల్లయితే..."

"అర్థమైంది మామ్మగారు! ఇక చెప్పొద్దులెండి" అంది శారదమ్మ మాటలకు అడ్డొచ్చి నవ్వుతూ నిర్మల.

**– చోడిశెట్టి శ్రీనివాసరావు,** వాకలపూడి, కాకినాడ

కార్డు కథలు

# పెద్దమనస్సు



"పాలిష్ బాబు... పాలిష్" పొద్దుట్నుంచి గొంతెండిపోయేలా అరుస్తున్నాడు- పన్నెండేళ్ళ కిరణ్. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి నాలిగిళ్ళలో పాచిపనులు చేసి సంపాదించేది. ఇప్పుడు ఆమెకి ఆరోగ్యం బాలేక మంచాన పడింది. తల్లిని పోషించాల్సిన బాధ్యత కిరణ్ తీసుకున్నాడు.

కారులోంచి దిగిన పెద్దమనిషి కిరణ్ దగ్గర, పాలీష్ చేయించుకున్నాడు. తరువాత 'వంద నోటు' ఇచ్చాడు. కిరణ్ 'చిల్లర' లేదన్నాడు. 'వుంచుకో' అంటూ ఆ పెద్దమనిషి హుందాగా కారు ఎక్కి వెళ్ళిపోయాడు. అతని 'పెద్ద మనస్సు'కి కిరణ్ ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

తల్లికి మందులు కొందామని మెడికల్ షాపుకెళ్ళాడు. కిరణ్ ఇచ్చిన వందనోటుని చూసి "ఇది దొంగనోటు" ఎక్కడది? అంటూ గదమాయించేసరికి కిరణ్ ఏడూస్తూ విషయం చెప్పాడు.

అతని 'పెద్ద మనస్సు'కి కిరణ్ 'చిన్న మనస్సు' గాయపడింది. "పాలీష్ బాబు... పాలీష్" అరుస్తూనే వున్నాడు కిరణ్...

**– మోపూరు రామశేషు,**
ఎర్రగడ్డ, హైదరాబాద్

# చెయ్యి వాచిపోయింది

బస్ నిండా జనాలతో కిక్కిరిసిపోయి నిండు గర్భిణిలా కదులుతోంది. నిలబడడానికి చోటులేక, ఒకరినొకరు నెట్టుకుంటూ, తాము దిగాల్సిన స్టాప్ కోసం ఆత్రపడుతున్నారు.

బ్రెడ్ ముక్కల మధ్య జామ్‌లా తనని అన్నివైపుల నుండీ నొక్కేస్తున్న జనాలను



తిట్టుకుంటూ బుచ్చిబాబు రాడ్ పట్టుకొని వేలాడుతున్నాడు.

అతడి వెనక నిలుచున్న వ్యక్తి బుచ్చిబాబు భుజం తట్టి.. వచ్చీ రాని తెలుగులో తన చేతిని చూపిస్తూ 'వాచిపోయిందని' ఒకటే మాటని పదే పదే చెప్పడంతో, బుచ్చిబాబు విసుగ్గా చూసి, "నువ్వింక నోరు మూయకపోతే, నీ మూతి వాచిపోతుంది" అని కసురుకున్నాడు అతడిని.

తన స్టాప్‌లో దిగిన అతడు తన చేతికున్న ఖరీదయిన వాచీ కనపడకపోవడంతో, ఆ వ్యక్తి మాటల భావాన్ని ఆలస్యంగా అర్థం అయినందుకు, తగిన మూల్యం చెల్లించానని విచారంగా తల పట్టుకున్నాడు బుచ్చిబాబు

– ఎ. రాజ రాజేశ్వరి
ఇండోర్

# పుస్తకాలు



నలుగురు వృద్ధులు... రోజూ సాయంకాలం కాలక్షేపం కోసం పార్కుకి వచ్చి కూర్చునే వాళ్ళు... ఆసక్తిగా గమనిస్తారా కుర్రాడిని.

రోజూ వస్తాడు. ఆ పచ్చికలో వెల్లకిలా పడుకుని పుస్తకం తెరుస్తాడు. చీకటి పడేదాకా చదువుకుని వెళ్లిపోతాడు.

క్షణం తీరిక లేకుండా రకరకాల వ్యాపకాల్లో, సరదాల్లో మునిగితేలే నేటి తరం యువకుల మధ్య అలాంటి కుర్రాడు... ఉండబట్టలేక ఒక రోజున అడిగేశాడో వృద్ధుడు 'పుస్తకాలంటే నీకెందుకంత ఇష్టము? ' అని.

'అనుభవం కోసం మీలాగా జీవితమంతా వృథా చేయడం ఇష్టం లేదు నాకు. అందుకే ఎందరో అనుభవాలసారాలైన పుస్తకాలు చదువుతూ ఉంటాను' ఠక్కున చెప్పాడా కుర్రాడు.

– వెంకటేష్

జనుపల్లె, తూర్పుగోదావరి జిల్లా

# నడక..ఎలా..?

కార్డు కథలు



రాజధాని నగరంలో ఓ కూడలి. దగ్గరలోనే బస్టాపు. పక్కనే రక్షకభట నిలయం. ఆ రెండింటి మధ్య సందు ఓ బడి, గుడి కూడా ఉన్నాయి.

పదడుగులు వేస్తే... మూడడుగుల వెడల్పు కూడా లేని ఓ సిమెంటు పైపు. అందులో- ఈ దేశ స్వాతంత్ర్యంలాగే... షష్టిపూర్తి దాటిన ఓ ఇద్దరు వృద్ధ మానవులు. అదే వారి ఆవాస గృహస్వర్గం.

మరికొంత ముందుకు వెళితే... జీవితంలో ఏ ఆటుపోట్లకో చెదిరిన మరో ప్రపంచపు (అస్తిమిత) జ్ఞానులు. పార్కు పక్కగా నడుస్తుంటే... ఆవారాగా తచ్చాడే అభాగ్యులు. ప్రధాన రహదారి రెండు పక్కలా... వైద్యం కోసం వచ్చిన బాధితుల దీనావస్థ. మరో సందు గుండా తిరిగి వస్తుంటే... కాళ్లు కూడా పూర్తిగా చాపుకోలేని, ఆరడుగుల జాగా కూడా లేని చోట్ల కుటుంబాలు, కాపురాలు, కాలకృత్యాలు... మనసంతా కకావికలం... ఇవెప్పుడు మారతాయి? ఎలా? నడక మంచిదని, ఉదయం పూట ఓ గంటయినా, ఓ మైలయినా నడచి వద్దామంటే కనిపించే దృశ్యాలివి!! ఏం చేయాలి? ... నా నడక ఆపేయాలా? ఆ దారి మారాలా? నా ఆలోచన మార్చుకోవాలా? నిజంగా.. మారాల్సింది ఏమిటి? ...

*– డి. విజయకుమారి*

హిమాయత్‌నగర్, హైదరాబాద్

# పుల్లకూర

కార్డు కథలు

"హలో! ఎవరు? "

"సెల్‌ఫోన్‌లో సరిగ్గా చూడండి. నేను మీ భార్యను"

"ఆ! వేగం చెప్పు. నాకవతల చాలా పనులున్నాయి"

"హహ్హహ్హ! నేను మీ భార్యనని అబద్ధం చెప్పాను. నేను మీ పక్కింటి రాధను. మీ



ఆవిడ సెల్ మాయింట్లో మరచిపోయింది. చాలా పనులున్నాయన్నారు. తరువాత చేసేదా ఫోను? "

"వద్దు.. వద్దు.. మా ఆవిడ అనుకొని అలా ఊరకే అన్నాను. నువ్వంటే నాకెంత ఇదో తెలుసు కదా!"

"రోజూ నా వైపు చూసే మీ ఓర, కొంటె చూపులు చూసి పసిగట్టాను"

"అయితే డైరెక్టుగా అడిగేస్తా! నీకింకా పెళ్లి కాలేదు కదా! నన్ను చేసుకుంటావా? "

"అమ్మో! మీ ఆవిడ ఒప్పుకోవద్దూ? "

"ఏడిసింది. ఆవిడ ఒప్పుకోకపోతే, నిన్ను సెకెండ్ సెటప్‌గా ఉంచుకుంటాను"

"మొదటిదానిని నన్నే సరిగా చూడలేకపోతున్నారు. మీకో సెకండ్ సెటప్పా? ఇంటికి రండి. మీపని చెప్తాను"

"ఇదేంటి! మా ఆవిడ గొంతులా వుంది. కొంపతీసి తను నేర్చుకుంటున్న మిమిక్రీ విద్య నామీద ప్రయోగించ లేదు కదా! అమ్మో! చచ్చా!!"

– దూశి గురునాథరావు

సీతమ్మధార, విశాఖపట్నం

కార్డు కథలు

# బొమ్మ... బొరుసు

అఖిల్ పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగవేటలో ఉన్నాడు. అఖిల్‌కి దైవభక్తి ఎక్కువ. ప్రతి పనికి దేవుడుమీదే భారం వేస్తాడు. పరీక్షలప్పుడు సబ్జెక్టు పుస్తకాలకంటే దేవుళ్ల గుళ్లకు వెళ్లడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాడు అఖిల్. అఖిల్ తండ్రి రామారావు అఖిల్ చేస్తున్న పనులు చూసి ఆందోళన చెందేవాడు.

అఖిల్ ఉద్యోగాల కోసం అప్లికేషన్లు పెట్టి ఇంటర్వ్యూలకు పిలుపు వస్తే ఏదో మొక్కుబడిగా వెళ్లి వస్తాడే తప్ప సీరియస్‌గా వెళ్లేవాడు కాదు. అందువలన అఖిల్‌కి ఏ ఉద్యోగం రాలేదు.



కొడుకుని ఎలాగైనా మార్చాలని తండ్రి రామారావు ఆలోచించి ఓ రోజు ఇంటర్వ్యూకెళుతున్న అఖిల్‌ని పిలిచి "అఖిల్! ఈ రూపాయిబిళ్ల దేవుని పాదాల వద్ద ఉంచింది. దీన్ని పైకి ఎగురవేస్తాను. బొమ్మ పడితే నీకు ఉద్యోగం వస్తుంది. బొరుసు పడితే ఉద్యోగం రాదు" అని చెప్పాడు.

తండ్రి రూపాయి బిళ్లను పైకి ఎగురవేయగానే 'బొమ్మ' పడింది. అఖిల్ సంతోషంగా ఇంటర్వ్యూకెళ్లి విజయం సాధించాడు.

రూపాయి బిళ్లకు మరొక రూపాయి బిళ్ల బొమ్మను అంటించి, రెండువైపులా బొమ్మే ఉండేటట్లు చేసిన విషయం తండ్రికి తప్ప అఖిల్‌కు తెలియదు.

– కె.నాగేశ్వరరావు, విజయవాడ

# ఊరట

చిన్నాన్న ద్వారా తాతయ్య మరణించారన్న విషయం తెలిసాక ఎంతో బాధ కలిగింది పవన్‌కు. అతను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అనంతపురంలోని తాతయ్య మరణవార్త వినడంతో మనసంతా ఆయన జ్ఞాపకాలు అలుముకొన్నాయి.

తాతయ్యకు ఎనిమిదిమంది సంతానం.



ముగ్గురు కొడుకులు, అయిదుగురు కూతుళ్లు. పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. పౌరోహిత్యం ద్వారా వచ్చే ఆదాయమే జీవనాధారం. అయితే ఇష్టపడుతూ కష్టపడడం అనే విషయాన్ని తాతద్వారా తెలుసుకోవచ్చు. పొద్దున్నే నాలుగింటికే నిద్రలేచే తాతయ్య రాత్రి పండు కొనేవరకు ఏదో ఒక పని చేసేవారు. ఏ పనికీ విసుక్కొనేవాడు కాదు. ఎవరినీ కసిరేవాడు కాదు. పిల్లలను బంధువులను, పనికోసం ఇంటికి వచ్చేవారిని చెదరని చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించేవారు. పిల్లల పెళ్లిళ్లు, మనవరాళ్ల పెళ్లిళ్లు కూడా జరిపించారు. అందరి బాగుకు అనుక్షణం తపించేవారు.

అలాంటి తాతయ్య అంత్యక్రియలకు తాను వెళ్లలేనన్న సంగతి మరింత బాధ కలిగించింది పవన్‌కు. ఏమి చేయాలా? అని ఆలోచించాడు. చిన్నాన్నకు ఫోనుచేసి తాత పేరిట అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి, చెన్నకేశవస్వామి ఆలయంలో నగ్రవహామండపం నిర్మించమని తానే ఆర్థిక సహాయం చేస్తానని చెప్పేడు. అప్పుడు అతనికి ఊరట కలిగింది.

– *రమణబాబు, తిరుపతి*

# పంజరంలోంచి బయటికి..

అమ్మ తన బట్టలు, అవసరమైన వస్తువులు సూట్ కేస్‌లో శ్రద్ధగా సర్దుకుంటోంది. ఆమె ముఖంలో చెప్పలేనంత తృప్తి, ఆనందం! అమ్మని ఆపడం మా తరం కాదు.

అమ్మ నాదగ్గరకొచ్చి.. "అలా దిగులుగా చూడకురా నానీ! మీకెప్పుడు వీలయితే అప్పుడు నా దగ్గరకు రావచ్చు" అంది నా తల నిమురుతూ.



అమ్మ సమస్య నాకర్థమవుతోంది. నాన్న ఏడాది క్రితం మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు. అమ్మ ఒంటరిదై ఇక్కడికొచ్చింది. ఆయనతో అక్కడ ఆమె జీవితం నలుగురి మధ్య కలివిడిగా సాగింది.

ఇప్పుడు ఇక్కడ అన్ని హంగులూ వున్న బంగారు పంజరపు బతుకు ఆమెది. పొద్దుట హడావిడిగా ఉద్యోగాలకు పరిగెత్తి, రాత్రికి అలసిపోయి ఇళ్లకు చేరే కొడుకు, కోడలు.. హాస్టలు నుంచి ఎప్పుడైనా ఇంటికొచ్చే మనవడు.. మౌనంగా పని ముగించుకుపోయే పనివాళ్లు.. రోజంతా భరించలేని నిశ్శబ్ద, నిర్మానుష్యపు ఒంటరి బతుకు. భయంకరమైన రాక్షసి లాంటి ఆ ఒంటరితనం నుంచి బయటపడాలన్న ఆలోచనే ఆమె ఈ నిర్ణయానికి కారణం.

"జరగరానిదేదో జరిగిపోతున్నట్టు బాధపడిపోవద్దు. హాయిగా నవ్వుతూ నన్ను సాగనంపండి" అంది అమ్మ కారెక్కుతూ.

"అత్తగారూ..!" అంటూ ఏదో చెప్పబోయిన సుమని ఆపుతూ..

"అక్కడ అందరూ నా వయసువాళ్లే వుంటారుట.. నాకు బోలెడు కాలక్షేపం.." అమ్మ మాట్లాడుతూనే వుంది, మా కారు ఊరి చివరనున్న 'వానప్రస్థ ఆశ్రమం' వేపు దూసుకుపోతోంది.

*– భాగవతుల లలితశర్మ, రాజమండ్రి*